త్యాగానికి ప్రతీక మొహర్రం

నేడు ముగింపు వేడుకలు

- వందేళ్ల నుంచి లంబాడాల మొహర్రం
- నిప్పులపై నడక...కొరడాతో దెబ్బలు
- టేకులపల్లి మండలంలో ఘనంగా పీరీల వేడుకలు



టేకులపల్లి: మూడుతండాలోని ఆషిర్‌ఖానా వద్ద భక్తుల సందడి

కొత్తగూడెంటౌన్/ఇల్లెందురూరల్/టేకులపల్లి: ముస్లింలకు రంజాన్ మాసం ఎంత పవిత్రమైందో.. మొహర్రం కూడా అంతే. మహ్మద్ ప్రవక్త మనవడు (హజరతే అలీ - బీబీఫాతీమాల కుమారుడు) అయిన ఇమామే హుస్సేన్ ఇస్లాం పరిరక్షణకు కర్బలా మైదాన్‌లో పవిత్ర యుద్ధం సాగించిన మాసం ఇది. హక్కుల కోసం ఇమామే హుస్సేన్ సాగించిన పోరాటంలో అమరుల త్యాగానికి ప్రతీకగా 'మొహర్రం'ను జరుపుకుంటారు. అయితే ఇమామే హుస్సేన్ పవిత్ర యుద్ధంలో మరణించలేదని, అమరుడయ్యాడని ముస్లిం పవిత్ర గ్రంథమైన ఖురాన్, హదీస్‌లో ఉంది. అందుకే మొహర్రం అంటే పండగ కాదు.. అమరవీరుల త్యాగాలను స్మరించడం. ఈ



కొత్తగూడెంటౌన్: రామవరంలో పీరీలు



ఇల్లెందురూరల్: ఏరియాలో పీర్ల ఊరేగింపు

పండగను మొహర్రం నెల మొదటి తేదీ నుంచి పదో తేదీ వరకు జరుపుకుంటారు. మొహర్రంనే పీర్ల పండుగ అని కూడా అంటారు. పీర్ అంటే మహాత్ములు, ధర్మ నిర్దేశకులు అని అర్థం. ధర్మ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ప్రతీకగా హస్తాకృతి కలిగిన రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి, ఊరేగించి, పూజించే వాటిని పీర్లుగా పిలుస్తారు. శనివారం పీర్ల పండుగ కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా కులమతాలకు అతీతంగా పీర్ల (మొహర్రం)పండగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఆషుర్‌ఖానాల్లో పీర్లను అందంగా ముస్తాబు చేశారు. కొన్ని ప్రాంతాలలో ఇతర మతాల వారు ముఖ్యంగా హిందువులు కూడా పీర్ల పండుగను పెద్ద పండగగా భావిస్తారు. హిందూ, మహమ్మదీయులు సామరస్యమే ఇందుకు ప్రధాన కారణం.

నూతన సంవత్సరం ఆరంభం..

ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలిమాసాన్ని మొహర్రంగా పిలుస్తారు.. ఈ మాసంలో 10వ రోజుకు ప్రత్యేకత ఉంటుంది. 10, 11 రోజుల్లో ఉపవాస దీక్షను పాటించడాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. ఎలాంటి శుభకార్యాలు చేయరు. ఇస్లాంను వ్యాపింపజేసేందుకు తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహమ్మద్ ప్రవక్త మనవడికి సంతాపం తెలియజేసే ఉద్దేశ్యంతో దీన్ని పాటిస్తామని ముస్లిం మతపెద్దలు చెబుతారు.

మద్రాస్ తండాలో ప్రత్యేకం..

జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని హెడ్ ఆఫీస్ ఏరియా, హనుమాన్‌బస్తీ, రామవరం 7 నెంబర్ బజార్, నెహ్రూబస్తీ, సెవెన్‌హిల్స్, రుద్రంపూర్, గౌతంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ఆషుర్ ఖానాలను పీరీలను అందంగా ముస్తాబు చేశారు. ఇల్లెందు, టేకులపల్లి మండలంలోని మూడ్‌తండా, బోడు, మద్రాస్‌తండా, ముత్యాలంపాడు, తడికలపూడి, వెంకట్యాతండా, కొత్తతండా(పి), గులాయిగడ్డ, తదితర గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో 'పీరీల'వేడుకలు నిర్వహిస్తున్నారు. మూడ్ తండా, బోడు గ్రామాల్లో జరిగే వేడుకలకు ప్రత్యేకత ఉంది. ఇక్కడి సవారీలు, పీరీలకు మహిమలున్నాయని స్థానికుల విశ్వాసం. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు, భక్తులు పీరీల పండుగ నాడు ఇక్కడి వేడుకలను తిలకించేందుకు వస్తుంటారు. పండుగ జరుగుతున్నన్ని రోజులు గ్రామంలో మద్యం, మాంసం ముట్టరు, కాళ్లకు చెప్పులు ధరించరు. మండల కేంద్రంలోని మూడ్‌తండా ఆషీర్‌ఖానా (పీరీల కొట్టం)కు వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లుగా తండా వాసులు చెబుతారు. సాధారణంగా పీరీల పండుగ అనగానే ముస్లింలు గుర్తుకు వస్తారు. కానీ మూడ్‌తండా, బోడు, మద్రాస్ తండాలతో పాటు మండలంలో పీరీల పండుగను బంజారాల ఆధ్వర్యంలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నిరాడంబరంగా జరుపుకోవాలి



హజ్రత్ ఇమామ్ హుస్సేన్ న్యాయం కోసం త్యాగాలు చేసినందుకు గుర్తుగా మొహర్రంను జరుపుకుంటారు. మూతవల్లిలు, ముజావర్లు, ఎటువంటి ఉత్సవాలు, ప్రదర్శనలు లేకుండా నిరాడంబరంగా మొహర్రంను జరుపుకోవాలి.

– ఎండీ యాకుబ్ పాషా, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

కులమతాలకు అతీతంగా..



మొహర్రంను ప్రతి ఏడాది మేషన్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా అత్యంత ఘనంగా కులమతాలకు అతీతంగా జరుపుకుంటున్నాం. మా కాలనీలోని అషుర్‌ఖానాలో పీరీలను ముస్తాబు చేశాం. త్యాగాలకు గుర్తుగా అందరం ఐకమత్యంగా జరుపుకుంటాం.

– కె.శివ, ముజావర్, మేషన్ కాలనీ, రామవరం, కొత్తగూడెం

ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నాం..



మొహర్రం మాసంలో పీర్ల పండుగను దశాబ్దాలుగా హిందూ ముస్లింలు కలిసి నిర్వహించుకుంటున్నాం. హక్కుల కోసం ఇమామే హుస్సేన్ యుద్ధం చేసి అమరుడయ్యారని, ఆ వీరుని స్మారకార్థం శోకతప్త హృదయాలతో పీర్ల పండుగ ప్రతి ఏటా కొనసాగిస్తున్నాం.

– సదానందం, 24ఏరియా, ఇల్లెందు

క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం



కుమారస్వామిని సత్కరిస్తున్న వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు

ఇల్లెందు: మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.కుమారస్వామిని మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లను భాగస్వామ్యులను చేయాలని, వార్డులలో లైట్లు ఏర్పాటు చేయాలని, ఆరు నెలలుగా పట్టణంలో గ్యాంగ్ వర్క్ పేరుతో పేరుకుపోయిన శానిటేషన్ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. వార్డులలో వరద సహాయక చర్యలు చేపట్టాలని, తక్షణం సహాయం అందటం లేదన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ జరపాలని పేర్కొన్నారు. వార్డుల్లోకి వచ్చే ముందు సమాచారం అందించాలని విన్నవించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైస్ చైర్మన్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, 12 మంది కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

టేకులపల్లి: వారం రోజులుగా కుండపోత వాన కురుస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని రోళ్లపాడు, మురుట్ల, సాయమ్మ, ముర్రేడు తదితర చెరువులు, వాగులు, కాలువలను పరిశీలించారు. అలుగులను, నీటి ప్రవాహాలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు. చెరువులు, కాలువలు, వాగుల వద్ద ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు



సీఐని సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా కొత్తగూడెం పట్టణంలో ఆటోలను నడపాలని త్రీటౌన్ సీఐ మురళీ తెలిపారు. శుక్రవారం సూపర్‌బజార్ ఆటో స్టాండ్ డ్రైవర్స్, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీఐని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో ఆటోలు నడపాలని, ఆటో యజమానులకు సంబంధించిన వివరాలు, ప్రయాణికులకు కనిపించే విధంగా ఆటోలో ఏర్పాటు చేయాలని సూచించారు. చల్లంగి శ్రీనివాస్, బెల్లం గట్టయ్య, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, సర్వయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, కుమార్ పాల్గొన్నారు.


కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



పనులను పరిశీలిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: శ్రీనివాస కాలనీలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం శ్రీనివాసకాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. వర్షం వస్తే కాలనీలో ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదన్నారు. వాననీటి నిల్వలు, చెట్ల పొదలు, అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ వల్ల ప్రజలు స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించాలన్నారు.

కూలిన పూరిళ్లు



రాజుతండాలో నేలమట్టమైన పూరిల్లు

జూలూరుపాడు: వర్షాలకు కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండాలో గురువారం గుగులోత్ వరాలి అనే వృద్ధురాలి పూరిగుడిసె మట్టి గోడ కూలింది. ఆ సమయంలో వరాలి ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గాంధీనగర్ పంచాయతీ రామకృష్ణాపురంలో పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు వరద ఉధృతికి కోతకు గురై గండిపడింది. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ శారద శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో కుండపోత వాన పడింది. రాంపురం, తూర్పుగూడెం, గంగారం, కొప్పురాయి, జండాలతండా, రాజుతండాల్లో లోలెవెల్ కల్వర్టుల వద్ద రాకపోకలు లేకుండా పంచాయతీ అధికారులు, పోలీసులు కంచెలు వేయించారు. చంద్రుతండా పంచాయతీ రాజుతండాలో కొర్ర బద్రియాకు చెందిన రెండు గదుల పూరిల్లు వర్షం కారణంగా కూలిపోయింది.

కిక్కు కావాలి: గ్రామసభ తీర్మానం

టేకులపల్లి: మండలంలోని నాలుగు మద్యం షాపుల నిర్వహణకు గాను శుక్రవారం టేకులపల్లి, దాసుతండా గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. టేకులపల్లిలో సర్పంచ్ సరిత, కార్యదర్శి కిరణ్, దాసుతండాలో సర్పంచ్ ప్రియాంక, కార్యదర్శి శరత్‌చంద్రల ఆధ్వర్యంలో వైన్ షాపులు ఏర్పాటుపై గ్రామసభలు నిర్వహించారు. టేకులపల్లిలో 100 మంది స్థానికులు, ఇద్దరు వార్డు సభ్యులు, దాసుతండాలో 60 మంది స్థానికులు, నలుగురు వార్డు సభ్యుల సమక్షంలో వైన్ షాపులు కావాలని గ్రామసభలో తీర్మానించారు. రెండు పంచాయతీల్లో వార్డు సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం గమనార్హం. వార్డు సభ్యులందరికీ సమాచారం ఇచ్చామని కార్యదర్శులు తెలిపారు. ఇదిలా ఉండగా వాస్తవానికి వైన్ షాపులకు సంబంధించిన రెండేళ్ల టెండర్ కాలపరిమితి నవంబర్‌తో పూర్తవుతుంది. డిసెంబర్‌లో శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందస్తుగానే గ్రామసభలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

పారిశుద్ధ్యం మెరుగుపర్చుకోవాలి




పోలారంలో దోమల నివారణ మందు చల్లుతున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: పారిశుద్ధ్యం మెరుగుపర్చుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం, చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాల, పోలారం గ్రామపంచాయతీలో శుక్రవారం ఫ్రైడే - డ్రైడే నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలల్లో నీటి నిల్వ కేంద్రాలను, ఆరుబయట ఖాళీగా ఉన్న పాత్రలను, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. ఆశ్రమంలో విద్యార్థులను పరీక్షించి పలు జాగ్రత్తలు సూచించారు. పోలారం గ్రామపంచాయతీలో ప్రతిఇంటికి వెళ్లి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణ, పరిసరాలను తామే శుభ్రం చేసుకోవాలని చెప్పారు. గ్రామంలోని మురుగుకాల్వలను పరిశీలించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల నివారణ మందును చల్లారు. కార్యక్రమంలో పోలారం పంచాయతీ కార్యదర్శి దీప్తి, హెచ్ఎస్ సమ్మయ్య, నర్సింహ, కళావతి తదితరులు పాల్గొన్నారు.


బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టండి

టేకులపల్లి: బోడు పంచాయితీ కారేపల్లి తండా నుంచి ఎర్రాయిగూడెం రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నేత ఎట్టి నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానికులతో కలిసి సమస్యాత్మక రోడ్డు వద్ద నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ... డబుల్ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతి లేకుండానే ఉన్న రోడ్డు తవ్వారని దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా ఈ ప్రాంత ప్రజల పరిస్థితి తయారయిందని విమర్శించారు. ఎమ్మెల్యే హరిప్రియ ఈ ప్రాంతానికి వచ్చి రోడ్డు నిర్మించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు రోడ్డు పూర్తి కాకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పొడెం నిర్మల, సుధాకర్, కుంజ జోగయ్య పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పంచాయతీ పరిధిలో పలు రహదారులు అధ్వానంగా మారాయని ఆరోపిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా శుక్రవారం రాఘబోయిన గూడెం గ్రాపంచాయతీ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. భారీ వర్షాలకు బోటిగుంపు రహదారి కోతకు గురైందని, రైతులు పంట చేలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నా గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని వాపోయారు. స్పందించిన కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రజలు చేస్తున్న ఆందోళనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంపై ప్రజలు నిరసన తెలిపారు.



టేకులపల్లి: కారేపల్లి తండా వద్ద నిరసన తెలియజేస్తున్న స్థానికులు



ఇల్లెందురూరల్: రాస్తారోకో చేస్తున్న రాఘబోయినగూడెం ప్రజలు

వీడని వర్షం.. రహదారులు ఛిద్రం..



చల్లసముద్రంలో చెక్‌డ్యాం వద్ద వరద ఉధృతి

ఇల్లెందురూరల్: పక్షం రోజులుగా కురుస్తున్న వర్షంతో ఇప్పటికే చెవవులు మత్తడి పోస్తుండగా, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల అలుగులు పోస్తుండడంతో పలు గ్రామాల్లో వరదనీరు పంట చేలల్లో పారుతోంది. చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ ఘాట్ వద్ద చెక్‌డ్యాం మీదుగా వరద ప్రవహిస్తోంది. ఇంతేకాకుండా పలుచోట్ల వరద ధాటికి రహదారులు కోతకు గురవుతున్నాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధిలో బోటగుంపు గ్రామ శివారులో రహదారి పూర్తిగా కోతకు గురైంది.

అనుమతి నిరాకరించడం సరికాదు..

ఇల్లెందు: ప్రభుత్వ విద్యా సంస్థలలోకి సంఘాలను అనుమతించరాదటంటూ రాష్ట్ర పాఠశాల డైరెక్టర్ దేవసేన డీఈఓల సమావేశంలో ఆదేశాలు జారీ చేయటం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్రప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ తీవ్రంగా ఆక్షేపించారు. శుక్రవారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరిగిన పీడీఎస్‌యూ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి సంఘాలకు అనుమతి లేకుంటే పాఠశాలలు దోపిడీకి నిలయంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంస్థలలో ఒక పక్క విద్యార్థుల ఆత్మహత్యలు, ఈవిటీజింగ్, ర్యాగింగ్, వేధింపుల సంఘటనలు పెరిగిపోతున్నాయని వాపోయారు. నిధుల దుర్వినియోగం కొనసాగుతోందని ఇలాంటి తరుణంలో అవి వెలుగు చూడకుండా అనుమతి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంపాటి పృథ్వీ, సంధ్య, సాయి, తరుణ్, గణేష్ పాల్గొన్నారు.

వ్యాయామంపై దృష్టి పెట్టండి

పాల్వంచ: ప్రతిఒక్కరూ వ్యాయామం, శరీర ధృడత్వంపై దృష్టి సారించాలని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కె.నరేశ్, చుంచుపల్లి ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఒడ్డుగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన కైరోస్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరుణ్, జయంత్, నతానేల్, రమేశ్, నరహరి, ఉండేటి ధనయ్య, చింతా నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. 38 మంది లబ్ధిదారులకు రూ.38 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మూడోసారి కూడా కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీపీ లావుడ్యా సోనీ, యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, వేల్పుల నరసింహారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, పొన్నెకంటి సతీష్ కుమార్, నున్నా రంగారావు, చౌడం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస చర్యలు చేపట్టండి

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా వ్యాపితంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన పేదలకు పునరావాసం గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజీలను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో భారీ వర్షాలు, వరదల మూలంగా రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రత్యేక నిధులు మంజూరు చేసి పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బస్తీలు, గ్రామాలు మురికి కూపాల్లా మారాయని, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అత్యవసర సిబ్బందిని నియమించి యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు.

వరదలు, వర్షాలకు వేలాది పేదల ఇళ్లు నేలమట్టమై నిరాశ్రయులుగా మారారని, దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ సహాయం రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

వనమా వెంటే మా ప్రయాణం..



మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మేమంతా వనమా వెంటే ఉంటాం.. మాకు ఆయనే బాస్.. నియోజకవర్గంలో చేయని అభివృద్ధి లేదు.. సాయం పొందని వారు లేరు అంటూ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ భూకా రాంబాబు, లక్ష్మీదేవిపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు ఎం.రాజుగౌడ్, నాయకులు ఎంఏ రజాక్, బీమా శ్రీధర్, విద్యార్థి సంఘ నాయకులు అనుదీప్ మాట్లాడారు. చిన్న టెక్నికల్ సమస్యతో ఒక నాయకుడు చేసిన పనికి హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని, కోర్టును గౌరవిస్తామన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి తీర్పు వచ్చినా వనమాతోనే తమ ప్రయాణమని స్పష్టం చేశారు. 85 సంవత్సరాల వయస్సులో కూడా వనమా నియోజకవర్గ అభివృద్ధికి ఇంకా తపన పడుతున్నారని కొనియాడారు.

కొట్టుకుపోయిన నాగారం చెక్‌డ్యామ్



నాగారం వద్ద కిన్నెరసాని వాగులో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్

పాల్వంచరూరల్: రూ.కోట్లు వ్యయం చేసి కిన్నెరసాని వాగుపై నిర్మించిన మూడు చెక్‌డ్యామ్‌ల్లో ఒకటి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. 2021లో సూరారం వద్ద రూ.13.20 కోట్లు, నాగారం వద్ద 12.74 కోట్లు, సోములగూడెం రూ.12.94 కోట్లు వ్యయం చేసి చెక్ డ్యామ్‌లను నిర్మించారు. గురువారం కిన్నెరసాని ప్రాజెక్టుకు చెందిన 12గేట్లు ఎత్తివేయడంతో ఒక్కసారిగా 1.10 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో వరద ప్రవాహానికి సూరారం వద్ద చెక్‌డ్యామ్ పాక్షికంగా దెబ్బతిన్నది. నాగారం వద్ద చెక్‌డ్యామ్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఆయా చెక్‌డ్యామ్‌లను శుక్రవారం జలవనరుల శాఖ డీఈ రాణి పరిశీలించారు. దీనిపై జలవనరుల శాఖ ఈఈ బి.అర్జున్‌ను వివరణ కోరగా.. కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడం వలన వరద ఉధృతికి నాగారం చెక్‌డ్యామ్ కొట్టుకుపోయిందని చెప్పారు. పరిశీలించి నాణ్యతా లోపం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

వార్డుల్లో సహాయక చర్యలు



సుజాతనగర్: చెత్త ఎత్తుతున్న వార్డు సభ్యులు

ఇల్లెందు: వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మరో పక్క మంచినీటి చెరువు అలుగు పొంగి ప్రవహిస్తోంది. బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తున్నారు. వరద సహాయక చర్యలను నూతన కమిషనర్ కుమారస్వామి సమీక్షించారు. సహాయక చర్యల్లో చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి పాల్గొన్నారు.

వార్డు సభ్యులు భేష్..

సుజాతనగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు. దీంతో శుక్రవారం మండల కేంద్రం సుజాతనగర్‌లో వార్డు సభ్యులు స్పందించారు. సుజాతనగర్‌లోని 1,4,8,11 వార్డుల సభ్యులు నడికట్టు జయరామిరెడ్డి, ఉబ్బనపల్లి మణికంఠ, గూని వీరభద్రరావు, ఎర్రబడి కృష్ణవేణిల ఆధ్వర్యంలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లలో డంప్ యార్డుకు తరలించారు. కార్మికుల సమ్మెతో వీధులన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నందున ఈ పనులకు ఉపక్రమించినట్లు వార్డు సభ్యులు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

పాల్వంచరూరల్: నాగారం వద్ద కిన్నెరసాని వాగులో వరద ఉధృతి కారణంగా కొట్టుకపోయిన చెక్‌డ్యామ్‌తోపాటు వరద ముంపుకు గురైన పంటపొలాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. కిన్నెరసాని వాగులో కొట్టుకపోయిన చెక్‌డ్యామ్ గురించి ఈఈకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. దంతలబోరులో వరద ముంపుకు గురైన పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేబీ శౌరి, మోతుకూరి ధర్మారావు, రావూరి నాగేశ్వరరావు, అల్లాడి నర్సింహారావు, గడ్డం రాజశేఖర్, సురేష్‌నాయక్, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, కాపా శ్రీనివాసరావు, మధు, ఫణి, మోహన్, తారాచంద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద నష్టంపై సర్వే చేయాలి

ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా మండలంలో జరిగిన పంట నష్టాలను అధికారులు సర్వే చేసి అంచనాలు వేసి ప్రభుతత్వానికి నివేదిక పంపించాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నాగారం, రంగాపురం ప్రాంతాల్లో శుక్రవారం ప్రజాప్రతినిధులతో కలిసి కొత్వాల పర్యటించారు.

కిన్నెరసానివాగులో కొట్టుకపోయిన చెక్‌డ్యామ్‌ను, రంగాపురం వద్ద పంటపొలాలను, కిన్నెరసాని బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న ప్రదేశాన్ని, కొట్టుకపోయిన వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మల్లెల శ్రీరామ్మూర్తి, మడవి సరస్వతి, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, కాటారపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న పోట్ల నాగేశ్వరరావు



పంటలను పరిశీలిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు